రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలి



లీకేజీ సమస్యను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ మెయిన్ రోడ్డులో మంచినీటి పైపు లైన్ లీకేజీతో గుంతలు ఏర్పడి నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బుధవారం వాటర్‌వర్క్స్ డీసీఎం, జీహెచ్‌యంసీ అధికారులతో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసరావు సమస్యను పరిశీలించారు. లీకేజీ, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతినగర్ మెయిన్ రోడ్డు ప్రసాద్ హాస్పిటల్ జంక్షన్ వద్ద వాటర్ పైపులైన్ లీకేజీతో రోడ్డుపై గుంతలు పడ్డాయని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం నాగప్రియ, అధికారులు ఏఈ రాజీవ్, వాటర్ లైన్ మెన్ శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 6 మందికి రూ.2 వేలు, నలుగురికి రూ.1500, మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండురోజులు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం



కుశల (ఫైల్)

మియాపూర్: బాలిక ఇంటి నుండి వెళ్లి తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం ... మైనర్ బాలిక కుశల(17)మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీలో ఉంటున్న మేనమామ నల్లగండ్ల రమేష్ కుమార్ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో కుశల బుధవారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇంటినుండి వెళ్లే సమయంలో మామ నన్ను తప్పుగా అనుకోకు నేను వెళ్లిపోవడానికి కారణముంది. అమ్మా, నాన్న వస్తే నన్ను తిడతారని వెళ్లిపోతున్నానని లెటర్ రాసింది. కుశల గతంలో స్నాప్‌చాట్‌లో కుమార్ అనే అబ్బాయితో పరిచయం అయింది. కుమార్ అమ్మాయిని ఇంటినుండి తీసుకువెళ్లాడు. దీంతో అమ్మాయి తల్లి దండ్రులు కుమార్‌ను కొట్టారు. దీంతో కుమార్ మృతి చెందిన ఘటనలో బాలిక తల్లిదండ్రులు జైలుకు వెళ్లారు. ప్రస్తుతం వారం రోజుల్లో జైలు నుండి వస్తున్నారని తెలుసుకుని బాలిక భయంతో ఇంటి నుండి వెళ్లిపోయిందని మేనమామ రమేష్‌కుమార్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తెల్లాపూర్‌లో మళ్లీ 17వార్డులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గతంలో లాగానే విలీన గ్రామాలతో కలిపి 17వార్డులను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విలీన గ్రామాలతో కలిపి మున్సిపల్ పరిధిలో 45వేల ఓట్లు ఉన్నట్లు తెలిపారు. ఒక్క వార్డుకు 2,900 నుంచి 3వేల ఓట్ల చొప్పున ఉన్నట్లు వివరించారు. ఈ విషయంపై త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు ఆయన వివరించారు.

చండీ హోమం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం చండీ హోమంను వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని అర్చకుల వేదమంత్రాల నడుమ ఆలయ మాజీ చైర్మన్ గటాటి భద్రప్ప, ఉమారాణి దంపతులు చండీహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య, అర్చకులు పాల్గొన్నారు

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో బుధవారం మల్లికార్జున స్వామి జాతరను వైభవంగా నిర్వహించారు. జాతరలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పృథ్వీరాజ్, వెంకటేశం పాల్గొని మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతికి జాతరలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు.భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆక్రమణల తొలగింపు..

రోడ్లు, ఫుట్‌పాత్‌లు తిరిగి ఆక్రమిస్తే చర్యలు: అధికారులు



మియాపూర్ జాతీయ రహదారి ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది

మియాపూర్: చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రోస్టేషన్ నుండి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను బుధవారం జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. జాతీయ రహదారిపై ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయంతో బాటు పాదచారులు రోడ్డుపై నడుస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఇటీవల సాక్షి దినపత్రికలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం-ట్రాఫిక్ సమస్య అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మియాపూర్ జాతీయ రహదారి ఇరువైపులా, మియాపూర్-బొల్లారం రోడ్డులోని ఫుట్‌పాత్ ఆక్రమణలను మియాపూర్ పోలీసుల బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో ఆక్రమణలను తొలగించారు. డబ్బాలు, తోపుడు బండ్లు, షెడ్లు, ఫర్నీచర్ దుకాణాలను తొలగించారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ఫర్నీచర్ దుకాణాలను తీసి వేయాలని నిర్వాహకులకు సూచించారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లను తిరిగి ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో మియాపూర్ సీఐ క్రాంతికుమార్, ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



భారతీయ విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత ఉంది

'మనూ' వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్



సదస్సులో పాల్గొన్న అతిథులతో వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: నైతిక విలువల ఆధారిత విద్య కారణంగా భారతీయ విద్యావ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ, ఎంఎంటీటీసీ, ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, బీహెచ్‌యూ, వారణాసి, యూపీ, లెర్న్ టు లీడ్ సంస్థ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత మేధస్సు, దాని శక్తి ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యావేత్తల అవసరాన్ని గుర్తించాలన్నారు .న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంటల్ స్టడీస్ గౌరవ ఆచార్యుడు వి సుధాకర్ మాట్లాడుతూ మానవ ఆలోచనలను శక్తివంతం చేయడంలో సాంకేతిక ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జేవి మధుసూదన్, డాక్టర్ రావుల కృష్ణయ్య ,ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు ప్రసంగించారు.

ఆస్తిపన్ను పెంపు ఆమోదయోగ్యం కాదు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్నును పెంచడం ఆమోదయోగ్యం కాదని, చట్టాలు దానికి సమ్మతించవని, ఆ విషయాన్ని పునః పరిశీలించాలని సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవికి బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. బుధవారం సీడీఎంఏ కమిషనర్ కార్యాలయంలో కలిసి మణికొండలో పెంచిన పన్నుల వివరాలను వివరించారు. పన్ను పెంచే ముందు ప్రజలకు నోటీసులు ఇవ్వాలనే కనీస నిబంధనను పాటించలేదన్నారు. గత సంవత్సరం ఎర్లీబర్డ్ పథకంలో మొత్తం పన్ను చెల్లించినా దాన్ని ఆరు నెలల వరకే తీసుకుని మిగతాది బకాయిగా చూపుతున్నారన్నారు. వాటిని పునః పరిశీలన చేసి పన్ను భారాన్ని తగ్గించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 2023 నుంచి వేతనాలు పెంచకపోవటంతో పెరుగుతున్న ధరలతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీతాన్ని రూ.24లకు పెంచాలని కోరామని అధ్యక్షుడు డి. సీతారాం తెలిపారు. మున్సిపాలిటీకి ఇటీవల స్టాంపు డ్యూటీ ద్వారా రూ. 230 కోట్లు వచ్చాయని వాటితో రోడ్ల విస్తరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె. ధన్‌రాజ్, జి. నరేందర్, పి. రూపారెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్ రావు, జి.విఠల్ పాల్గొన్నారు.

ఆహారంలో మిల్లెట్స్ భాగమవ్వాలి

ఐసీఏఆర్-ఐఐఎంఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి



డైరెక్టర్ తారా సత్యవతికి జ్ఞాపికను అందిస్తున్న వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రతిరోజూ అందరూ మిల్లెట్స్ తినే అలవాటు చేసుకోవాలని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సి. తారాసత్యవతి సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్‌ఐనుల్ హసన్ అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి కోసం మొక్కలు-మానవ పరస్పర చర్యలు' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవాలన్నారు. వైస్‌చాన్స్‌లర్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ జీవితంలో మొక్కల ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్, కన్వీనర్ డాక్టర్ ఇరాఖాన్ మాట్లాడుతూ స్థిరమైన మానవాభివృద్ధిలో మొక్కలు కీలకమన్నారు. డీన్ ప్రొ.అలీమ్ బాషా, ప్రొఫెసర్లు ఫజల్‌ఉర్ రహమాన్, పర్వీన్ జహాన్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు 'అబ్‌స్ట్రాక్ట్ పుస్తకం, గఫూర్ అన్ నిసా రచించిన ఫ్లోరా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సమతా కుంభ్‌లో విష్ణు సహస్ర నామ పారాయణం



శంషాబాద్ రూరల్: ముచ్చింతల్‌లోని సమతాస్ఫూర్తి కేంద్రంలో కొనసాగుతున్న సమతాకుంభ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర సామూహిక పారాయణం నిర్వహించారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఉదయం సుప్రభాతం, అష్టాక్షరీ మంత్ర జపం, ఆరాధన, సేవాకాలం, హోమాలను జరిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శ్రీరాంనగర్ కాలనీ సమస్యలపై వినతి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన శ్రీరాంనగర్ కాలనీవాసులు

గచ్చిబౌలి: కాలనీ సమస్యలు, అభివృద్ధి పనులపై కొండాపూర్ డివిజన్ శ్రీరాంనగర్ ఏ బ్లాక్‌వాసులు బుధవారం ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రాన్ని సమర్పించారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులను కల్పించేందుకు దశలవారీగా అన్ని చర్యలు తీసు కుంటామన్నారు. అసంపూర్తి రోడ్ల సమస్య పరిష్కరిస్తామన్నారు. శ్రీరాంనగర్ కాలనీలో ప్రధాన రహదారి నుంచి కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వరకు రోడ్డు వేయాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, వీధిదీపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌పాషా, కాలనీ అధ్యక్షుడు శివకుమార్, విజయ్‌కుమార్, వెంకటరమణ, రాజ్‌కుమార్, నారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: మండలంలోని చౌదరిగూడ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని బుధవారం గ్రామస్తుడు శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జీఓ 111 నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

పొగాకు రహిత సమాజానికి కృషి

పటాన్‌చెరు టౌన్: పొగాకు రహిత సమాజానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి. బుధవారం పటాన్‌చెరు బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పొగాకు నియంత్రణపై ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం యువత పొగాకుకు బానిసలై విచ్చలవిడిగా వాడుతున్నారని, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.సిగరెట్, జర్దా, గుట్కా, పాన్ మసాలాలు తీసుకుంటే చిన్న వయసులోనే క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. బహిరంగ ప్రదేశంలో పొగాకు తాగినప్పుడు..ఇతరులు పొగను పీల్చడం ద్వారా వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా టెలిమానస్ 14416 ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నామని వివరించారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి పొగాకు రహిత సమాజం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బండ్లగూడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్ ప్రాంతానికి చెందిన మహేందర్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా ఇస్తుందని అన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

రాజేంద్రనగర్: చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉప్పరపల్లిలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ అధ్యక్షుడు శ్యాం బాబు మాట్లాడుతూ.. తమ సంస్థ అనేక చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాల ప్రదర్శకులు సామ్‌గుండి మాట్లాడుతూ.. వైద్యం భారంగా మారిన ఈ రోజుల్లో నిరుపేదలకోసం శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రవణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా జెబ రెహమాన్

మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా రాజేంద్రనగర్‌కు చెందిన జెబ రహమాన్ నియమితులయ్యారు. ఇటీవల మొయినాబాద్‌లో ఎన్నిక జరగగా బుధవారం ఆమెకు పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్నిక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె నార్సింగిలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు మహిళా కాంగ్రెస్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్ కాలనీ, గోల్డెన్ తులీప్ రోడ్ నంబర్ 1,2,3,4,5, వెంకటరమణ టాటా మోటార్స్, రాఘవేంద్ర కాలనీ హైటెన్షన్ లేన్, విజేత సూపర్ మార్కెట్ రోడ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు..
- భిక్షపతి ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కైలాష్‌నగర్, టెక్నో అపార్ట్‌మెంట్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, కైలాష్‌నగర్, శ్రీదేవి థియేటర్ దగ్గర, ఎస్‌వీఎస్ ఇన్నా ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

హఫీజ్‌పేట్, మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో

హఫీజ్‌పేట్, మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో.. గురువారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, వార్డు కార్యాలయం, గ్రీన్ బావర్చి ఏరియాలలో..
- మాతృశ్రీనగర్, మాధవ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు న్యూహఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్ పూర్తిగా, ప్రేమ్‌నగర్ బి బ్లాక్ ప్రాంతాలలో..
- మదీనాగూడ సబ్‌స్టేషన్ హనుమాన్ టెంపుల్ నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మదీనాగూడ, మైత్రీనగర్, మదీనాగూడ విలేజ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మదీనాగూడ, కృషినగర్, ఎంఏనగర్, స్టాలిన్ నగర్, ప్రశాంత్‌నగర్, వీడియో కాలనీ, మియాపూర్ మెయిన్ రోడ్డు, ఎఫ్‌సిఐ కాలనీ, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, సత్య కళ్యాణి అపార్ట్‌మెంట్స్, ఎస్‌ఎంఆర్ మెట్రో పొలిస్, ఎస్ఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్,, వడ్డెరబస్తీ, విజేత సూపర్ మార్కెట్, టాకీటౌన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

మియాపూర్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

రాంనరేష్ నగర్, మయూరినగర్, లెజెండ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రాంనరేష్‌నగర్, హైదర్‌నగర్, వర్టెక్స్ అపార్ట్‌మెంట్, శ్రీనివాస్ అపార్ట్‌మెంట్స్, మయూరినగర్, ఓల్డేజ్ హోం, ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు, విజేత సూపర్‌మార్కెట్ రోడ్డు, ఏఎస్‌రాజునగర్, మిత్రహిల్స్, ప్రశాంత్‌నగర్, లెజెండ్ అపార్ట్‌మెంట్స్, మయూరినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

జేఈఈలో గురుకుల బాలికల సత్తా



తేజస్విని 98.295



భవ్యశ్రీ 95.75



నేహలత 93.22



నిహారిక 93.03

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్ మొదటివిడత ఫలితాల్లో శేరిలింగంపల్లి గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాల బాలికలు సత్తా చాటారు. కళాశాల నుంచి మొత్తం 104 మంది మెయిన్స్ రాయగా అందులో 90 పర్సెంటైల్‌పైగా నలుగురు, 80 పర్సెంటైల్‌కు పైగా 20 మంది, 70 పర్సెంటైల్‌పైగా 23 మంది, 60 పర్సెంటైల్‌పైగా 15 మంది సాధించారు.డీ.తేజస్విని 98.295 పర్సెంటైల్ సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. భవ్యశ్రీ మామిడి 95.75 పర్సెంటైల్‌తో ద్వితీయ స్థానం సాధించగా,నేహలత 93.22, నిహారిక 93.03 పర్సెంటైల్ సాధించి మూడవ, నాల్గవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ పి కల్పన , కార్యదర్శి అలుగువర్షిని, సంయుక్త కార్యదర్శి సంతోషి, ఓఎస్‌డీ వివేకానంద, స్టేట్ ఆఫీసర్ ఎం భీమయ్య వారిని అభినందించారు.

దివ్యాంగుల పోరాటానికి మద్దతివ్వాలి



కవితకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగుల సమాఖ్య ప్రతినిధులు

రాయదుర్గం: దివ్యాంగుల రాజకీయ రిజర్వేషన్ల పోరాటానికి మద్దతు ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమాఖ్య ప్రతినిధులు కోరారు. బుధవారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఏఐసీసీ మేనిఫెస్టో-2024లో దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఛత్తీస్‌ఘడ్‌లో అమలు మాదిరిగా తెలంగాణలో అమలు చేసేలా చూడాలని వారు కోరారు. బీఆర్‌ఎస్ పార్టీలో కూడా దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్ యాదవ్, శ్రీనివాసులు, వెంకటరమణ, సాయిబాబు, ఊర్మిళ, మల్లేశ్వరి, శ్రీనివాస్, హస్సేన్, భువనేశ్వర్ పాల్గొన్నారు.

అనధికారిక పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ వెంకటయ్యకు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు పాఠశాలల సంఘం ప్రతినిధులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కొనసాగుతున్న అనధికారిక పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల విద్యాధికారి ఎస్ వెంకటయ్యకు ప్రైవేటు పాఠశాలల సంఘం సభ్యులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం మండల విద్యాధికారి కార్యాలయంలో వారు ఆయనను కలిశారు. చందానగర్‌లో కొన్ని పాఠశాలలు అనుమతి లేకుండా నడుస్తున్నాయని వారు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎంఈఓ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మారోజీ, ప్రధాన కార్యదర్శి కె వాసు, ప్రతినిధులు అబ్దుల్ రెహమాన్, భీష్మారెడ్డి, సభ్యులు రాజు, త్రిమూర్తులు, శ్రీనివాస్‌రెడ్డి, భాను, ఇక్బాల్ పాల్గొన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లు సీజ్

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న రెడీమిక్స్ ప్లాంట్లను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. గత కొన్నేళ్లుగా పర్యావరణ, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఔటర్ రింగురోడ్డు, హిమాయత్‌సాగర్ చెరువును ఆనుకుని పెద్ద సంఖ్యలో రెడీమిక్స్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. ఇటీవల వీటి సంఖ్య పెరుగుతున్న కారణంగా స్థానికులు, పర్యావరణ వేత్తలు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్‌ఐ కృష్ణ సిబ్బంది ప్లాంట్లను పరిశీలించి సీజ్ చేసి సీల్ వేశారు. అక్రమంగా ప్లాంట్లు కొనసాగితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్ దత్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభం



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని మానసహిల్స్‌లోని సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఉదయం ప్రత్యేక పూజలతో అమ్మవారిని గద్దెలపైకి తీసుకువచ్చారు. శివసత్తులు, యువతీ యువకుల ఆటపాటల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం భారీగా వచ్చిన భక్తులు అమ్మవారికి బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక శాసన సభ్యులు ప్రకాశ్ గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.